క్లుప్తంగా

అరుణాచలేశ్వర ఆలయంలో పూజలు



ఆలయం వద్ద కుటుంబీకులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన జన్మదిన సందర్భంగా మంగళవారం అరుణాచలేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ సోయం

బోథ్: సొనాల మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ మేడి బండు పటేల్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ సోయం బాపూరావు బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తు ల రమేశ్, సొనాల పట్టణ అధ్యక్షుడు అనిల్, నాయకులు గాజుల పోతన్న, పోశెట్టి, కసిరి పోతన్న, సంఘ పాల్, సాయిరెడ్డి ఉన్నారు.

సీఎం ఇంటి ముట్టడికి తరలిన రెడ్డి సంఘం నాయకులు



ముట్టడికి తరలిన నాయకులు

కైలాస్‌నగర్: రెడ్డి కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్ల నిధులు కేటాయించడంతోపాటు పాలక మండలిని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో రెడ్డి సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన పలువురు నాయకులు తరలివెళ్లారు. తమ డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందిస్తూ పార్టీ ముఖ్య నాయకులు వేం నరేందర్‌రెడ్డి, జానారెడ్డి, సుదర్శన్‌రెడ్డిలతో ప్రత్యేక కమిటీని నియమించినట్లుగా క్యాతం శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వారం, పది రోజుల్లో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, చైర్మన్‌తోపాటు నూతన కమిటీని నియమిస్తామని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హామీఇచ్చినట్లుగా ఆయన పేర్కొన్నారు.

మహాధర్నాలో సీపీఐ నాయకులు



నారాయణమూర్తితో ప్రభాకర్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్: 'ఆపరేషన్ కగార్'ను ఆపాలనే ప్రధాన డిమాండ్‌తో మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగిన మహాధర్నాలో జిల్లా సీపీఐ నాయకులు పాల్గొన్నారు. అటవీ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడం కోసమే కేంద్రం ఈ చర్యను చేపట్టిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ఇది చట్టంలోని ఆదివాసీ హక్కులు కాలరాయడమేనని అన్నారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి రావడంతో ప్రభాకర్ రెడ్డి ఆయన్ను ప్రత్యేకంగా సభకు తీసుకెళ్లారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న యోగా శిక్షకుడు సాయి

ఇచ్చోడ: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తోందని యోగా శిక్షకుడు సాయి అన్నారు. మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో మంగళవారం ప్రభుత్వ ఆయుర్వేద కేంద్రం తరఫున మంగళవారం విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ యోగా చేయవచ్చునని తెలిపారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఆయుర్వేద డాక్టర్ శ్రీకాంత్ మందులు పంపిణీ చేశారు. సిబ్బంది స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

416 ఎస్‌హెచ్‌జీలు.. రూ.44.16 కోట్లు

- మెప్మా బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం ఖరారు
- గతేడాది కంటే రూ.3.93 కోట్లు అదనం
- మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత



సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న సీఓ (ఫైల్)

కైలాస్‌నగర్: పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు) పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా అందించే బ్యాంకు లింకేజీ రుణలక్ష్యాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. 2025–26 ఆర్థికసంవత్సరానికి గాను ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో రూ.44.16 కోట్లు అందించాలని లక్ష్యంగా నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. గతేడాది లక్ష్యానికంటే ఈ ఏడాది రూ.3.93 కోట్లు అదనంగా కేటాయించింది. లక్ష్యానికనుగుణంగా అర్హులైన సంఘాలకు రుణాలందించే దిశగా పట్టణ మెప్మా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అర్హత గల సంఘాల్లో ఒక్కోదానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలను అందించే కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు తోడ్పడనుంది.

ఆర్థిక స్థిరత్వం సాధించేలా..

స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడంతోపాటు వ్యాపారులుగా ఎదగాలనే ఉద్దేశంతో రుణాలందిస్తోంది. టైలరింగ్, కిరాణా, సెంట్రింగ్, ఆహార ఉత్పత్తుల తయారీ, కుటీర పరిశ్రమల ఏర్పాటు, పాడి ఉత్పత్తి, కోళ్ల పెంపకం వంటి వ్యాపారాలకు ఆర్థికంగా చేయూతనందిస్తోంది. ఒక్కో సంఘంలో పది మంది సభ్యులు ఉండగా, వారి రుణ వాయిదాల చెల్లింపుల ఆధారంగా రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు అందజేస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆయా వ్యాపారాల్లో రాణించడంతోపాటు తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు అవకాశం ఏర్పడుతుంది. అయితే చాలామంది సభ్యులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకుండా వెనుకబడిపోతున్నారు. అలాంటి వారు తిరిగి కొత్త రుణాలు పొందేందుకు అర్హత సాధించలేక నష్టపోతున్నారు.

గతేడాది లక్ష్యానికి మించి..

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పట్టణంలోని 421 సంఘాలకు రూ.40.22 కోట్లను బ్యాంకు లింకేజీ కింద రుణాలుగా అందించాలని నిర్ణయించారు. లక్ష్యం కేటాయింపు నుంచే బ్యాంకులు, సంఘాల వారీగా మెప్మా అధికారులు, ఉద్యోగులు పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగారు. వారి కృషి ఫలితంగా 382 సంఘాలకు గాను రూ.72.93 కోట్ల రుణాలు అందించారు. ఇందులో సంఘాల సంఖ్య కాస్తా తగ్గినప్పటికి లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేసి మహిళలకు అండగా నిలిచారు. కాగా ఈ ఏడాది 416 సంఘాలకు గాను రూ.44.16 కోట్ల రుణాలు అందించాలని సంకల్పించారు. అయితే రుణాల మంజూరుతోపాటు వాటిని తిరిగి చెల్లించేలా మెప్మా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించినట్లైతే మరింత మంది సభ్యులకు కొత్త రుణాలు పొందేందుకు అవకాశం కలిగి, ఆర్థిక లబ్ధి చేకూరే అవకాశముండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. పట్టణానికి కేటాయించిన రుణలక్ష్యంలో ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో అమలు చేస్తున్న వందరోజుల కార్యచరణ ప్రణాళికలో సగం రుణాలందించాలని లక్ష్యంగా నిర్దేశించింది. సెప్టెంబర్ 31 వరకు రూ.22 కోట్ల రుణాలు అందించేదిశగా పక్కా ప్రణాళికను సిద్ధం చేశాం. అందుకనుగుణంగా ముందుకు సాగి నిర్దేశిత లక్ష్యాన్ని సాధిస్తాం.

– కె.శ్రీనివాస్, మెప్మా, డీఎంసీ

హాజరు అంతంతే..

- జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో పరిస్థితి
- బడి పునఃప్రారంభమై వారం గడిచినా రాని విద్యార్థులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



బేల మండలకేంద్రంలోని ఆశ్రమ పాఠశాల (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈనెల 12న పునఃప్రారంభమయ్యాయి. వారం రోజులు గడుస్తున్నా జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగా ఉంది. మొత్తం 10 శాతం కూడా హాజరుకాని పరిస్థితి. గ్రామాలకు వెళ్లి వారికి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ అధికారుల ఆదేశాలను ఉపాధ్యాయులు బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకనే విద్యార్థుల హాజరుశాతం పెరగడం లేదని గిరిజన సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. విద్య ప్రాముఖ్యతపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతోనే ఆ పరిస్థితి ఉందని వాపోతున్నారు.

జిల్లాలో 54 ఆశ్రమ పాఠశాలలు..

జిల్లాలో 54 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 21 బాలికల, 28 బాలుర, మరో ఐదు కోఎడ్యుకేషన్ పాఠశాలలు ఐటీడీఏ పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఆయా పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం సుమారు 14 వేలకుపైగా రెన్యూవల్ అయిన విద్యార్థులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే సకాలంలో పాఠశాలలకు హాజరుకాకపోవడంతో గిరిజన విద్యార్థులు నష్టపోతున్నారు.

సాయంత్రం హాజరైనట్లు అటెండెన్స్

- జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో 360 మంది విద్యార్థులు ఉండగా నేటికి 20 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 340 మంది హాజరుకాలేదు.
- భీంపూర్ మండలం అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో 130 మంది విద్యార్థులు ఉండగా 23 మంది హాజరైనట్లు డివిజన్ స్థాయి అధికారులకు అటెండెన్స్‌ను పంపించారు.

జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో హాజరైన విద్యార్థుల అటెండెన్స్‌ను ప్రతీరోజు మధ్యాహ్నం వరకు సంబంధిత అధికారికి నివేదిక అందజేస్తారు. ఉదయం ఒకటి హాజరుశాతం ఉంటే సాయంత్రం మరో అటెండెన్స్ నివేదిక ఉంటున్నట్లు తెలిసింది. సాయంత్రం విద్యార్థులు పాఠశాలకు హాజరైనట్లు కొంత మంది టీచర్లు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. విద్యార్థుల హాజరుశాతం పెంపుపై తీసుకుంటున్న చర్యలపై ఐటీడీఏ డీడీని 'సాక్షి'ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నేడు యువజన కాంగ్రెస్ కమిటీ సమీక్షా సమావేశం

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలోని కలెక్టర్‌చౌక్‌లో గల వజ్ర బంకెట్ హాల్‌లో బుధవారం యువజన కాంగ్రెస్ కమిటీ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆ కమిటీ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా కమిటీ శ్రేణులు, నాయకులు రావాలని కోరారు.

పీఎం జన్‌మన్‌తో గిరిజన ప్రాంతాల అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

ఇచ్చోడ: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిరిచెల్మ గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈపథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, సేవలు పూర్తిస్థాయి ప్రయోజనాలను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. గిరిజనప్రాంతాల్లో సామాజిక, ఆర్థికాభివృద్ధితోపాటు మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో లక్ష్మణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక సంఘం చైర్మన్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: ఔట్‌సోర్సింగ్ జేఏసీ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రణాళిక సంఘం చైర్మన్ జి.చిన్నారెడ్డిని కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బండ శ్రీను మాట్లాడుతూ 2025–26కు గాను రెన్యూవల్ లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మూడు నెలల వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే రెన్యూవల్ చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలన్నారు. రామగిరి సంతోష్, జ్ఞానేందర్, తోట రాజు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నార్నూర్: గాదిగూడ మండలం పిప్రి గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు మృతి చెందిన పెందూర్ మాధవ్‌రావు, సిడం రాంబాయి, మంగం భీంబాయి, పెందూర్ సుజాతల కుటుంబ సభ్యులను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే తనవంతుగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. పిడుగుపాటుకు మృతిచెందిన నలుగురు బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ వెల్ఫేర్ స్కీం కింద రూ.25 వేలు, నేషనల్ ఫ్యామిలీ స్కీం రూ.25 వేలు, విపత్తు పథకం కింద రూ.6లక్షలు, రైతు బీమా ద్వారా డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో రైతులు పంట పొలాల్లోకి వెళ్లకూడదన్నారు. ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోయం మారోతి, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

రైతు భరోసా అందించాలి



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

బోథ్: కౌలు రైతులకు ప్రభుత్వం రైతు భరోసా అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం చేస్తున్న వారిలో దాదాపు 40 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని, వీరికి సరైన కౌలు రుణఅర్హత కార్డులు అందక, సరైన గుర్తింపు లేక ప్రభుత్వ పథకాలను దూరమవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌లో కౌలు రైతులకి రైతుభరోసా నిధులు ఇస్తామని ప్రకటించారని గుర్తుచేశారు.

నేడు న్యాప్‌కిన్ మేకింగ్ యూనిట్ ప్రారంభం

కైలాస్‌నగర్: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన సానిటరీ న్యాప్‌కిన్ మేకింగ్ యూనిట్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించనున్నట్లు మెప్మా డీఎంసీ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి స్వయం సహాయక సంఘ సభ్యులు, మెప్మా సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రామదేవతలకు పూజలు

సిరికొండ: మండల కేంద్రంలోని మున్నూరు కాపు, పెరిక సంఘాల ఆధ్వర్యంలో గ్రామ దేవతలైన మహాలక్ష్మి, పోచమ్మ దేవతలకు పూజలు నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగుండాలని గ్రామదేవతలను వేడుకున్నట్లు పేర్కొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

సాత్నాల: అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో సురేఖ కోరారు. భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఏసీడీపీవో నరసమ్మ, సూపర్‌వైజర్ శృతి, అంగన్‌వాడీ టీచర్లు వసంత, లక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

నేరడిగొండ: ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని హెచ్ఈఓ పవార్ రవీందర్ అన్నారు. బుగ్గారంలో మంగళవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామస్తులకు రక్తపోటు, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎస్‌సీఆర్‌పీ ప్రకాశ్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ నిఖత్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయుడిని నియమించాలి

తాంసి: మండలంలోని గోట్కూరి జెడ్పీ పాఠశాలకు ఆంగ్ల ఉపాధ్యాయుడిని నియమించా లని సీపీఐ జిల్లా నాయకుడు దేవిదాస్ కోరా రు. జిల్లాకేంద్రంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఆంగ్ల టీచర్‌ను త్వ రగా నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



హస్నాపూర్‌లో దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

తాంసి: రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం గ్రామాలవారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తెలిపారు. మండలంలోని హస్నాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును పరిశీలించారు. సదస్సులో వచ్చిన వివిధ దరఖాస్తుల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళకు నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ పథకం కింద రూ.20 వేలు అందిస్తామన్నారు. అర్హులైన ఒంటరి మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ గణేశ్, సర్వేయర్ ప్రసాద్, ఆర్ఐ సంతోశ్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు అందిస్తే పరిష్కరిస్తాం

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ రైతువేదికలో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రమేశ్ తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తు అందిస్తే త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఆర్ఐ హుస్సేన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ఇంద్రవెల్లి: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని బుర్సన్‌పటర్ గ్రామ రైతులు కోరారు. బుర్సన్‌పటర్ గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఏజెన్సీలో గిరిజనేతరులు 1970 కంటే ముందు నుంచి సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు, పహణీలు లేక బ్యాంక్ రుణాలు పొందలేకపోతున్నామన్నారు. రైతు భరోసా, రైతుబీమా, ప్రభుత్వ పథకాలకు దూరవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనేతర రైతులు సోన్‌కాంబ్లే పిరాజీ, కాంబ్లే భారత్, గాయక్‌వాడ్ మాధవ్, బలేరావ్ రాందాస్, లాండ్గే దయానంద్, సోన్‌కాంబ్లే ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

15 దరఖాస్తుల స్వీకరణ

సాత్నాల: భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు పరిష్కారం చూపుతాయని తహసీల్దార్ విశ్వనాథ్ పేర్కొన్నారు. పార్డి(బి) గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 15 దరఖాస్తులను స్వీకరించారు. భూ సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే, మీ గ్రామానికి వచ్చిన అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, రికార్డు అసిస్టెంట్ వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్: పిప్రిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీవో వినోద్

'భూభారతి'పకడ్బందీగా నిర్వహించాలి

బజార్‌హత్నూర్: భూభారతి చట్టాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో వినోద్ పేర్కొన్నారు. మండలంలో పిప్రి, భూతాయి గ్రామాల్లో మంగళవారం భూభారతి చట్టంపై నిర్వహించిన రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా ఏళ్లుగా పెండింగ్ భూసమస్యలు పరిష్కారమవుతాయన్నారు. భూసమస్యలు ఉన్న రైతులు నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చే సుకో వాలన్నారు. తహసీల్దార్ శ్యాంసుందర్, నాయ బ్ తహసీల్దార్ హీరాలాల్, ఆర్ఐ నూర్‌సింగ్, సీని యర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రవంతి, రమేశ్, భోజన్న, వికాస్ గౌతం పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ: రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎంఏ కలీమ్ కోరారు. వడూర్, బుగ్గారం(బి) గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



బోటు మిషన్ బోటు మిషన్‌తో ఇసుక తరలింపు

జైనథ్: పెన్‌గంగ పరివాహక ప్రాంతాలైన సాంగ్వి, ఆనంద్‌పూర్ గ్రామాల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కొందరు ట్రాక్టర్ల పేరిట అనుమతి తీసుకుని టిప్పర్లతో రవాణా చేస్తున్నారు. గతంలో ఆర్డీవో వద్ద ట్రాక్టర్ సహాయంతో ప్రభుత్వ కార్యకలాపాలకు అనుమతులు తీసుకుని, కొందరు అధికారులతో కుమ్మక్కయ్యారు. పెన్‌గంగ నదిలో ఇసుక బోటుతో రోజుకు లక్షల్లో గడిస్తున్నారు.వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని బెల్లం వద్ద 200 ట్రిప్పుల అక్రమ ఇసుక నిల్వలు ఉన్నాయి. సాక్షాత్తు జిల్లా కలెక్టర్.. ఎక్కడ కూడా ఇసుక రవాణాకు అనుమతి లేవని తెలిపినా స్థానిక అధికారులు మాత్రం ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో అధికారికి లక్షల రూపాయల్లో ముడుపులు ముట్టినట్టు వినికిడి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

గుడిహత్నూర్: రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడాపాఠశాలల్లో 2025– 26 సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి మండలస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఉదయ్‌రావ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న 8 నుంచి 9 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 19న స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే పోటీల్లో పాల్గొనాలని కోరారు. విద్యార్థులు తమ వయ స్సు, కుల, విద్యార్హత, ఆధార్ ధ్రువపత్రాలు తీసుకు రావాలని సూచించారు. వివరాలకు స్థానిక విద్యావనరుల కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

కారు తాకట్టు పెట్టిన రౌడీషీటర్ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: కారు తాకట్టు పెట్టిన రౌడీషీటర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మోహన్‌కు సంబంధించిన కారును సునార్‌గల్లికి చెందిన రౌడీషీటర్ ముమ్మర్‌వార్ రాజ్‌కుమార్ ఏప్రిల్ 29న అద్దెకు తీసుకెళ్లాడు. మహారాష్ట్రలోని పూసద్‌లో ఇతరుల వద్ద తాకట్టు పెట్టి రూ.3.50 లక్షల డబ్బులు తీసుకున్నాడు. ఈ విషయమై యజమాని కారు తిరిగి ఇవ్వాలని అడగగా రేపుమాపు అంటూ తిప్పుకుంటున్నాడు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. తాకట్టు పెట్టిన కారును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో పలువురి వద్ద నుంచి నిందితుడు కారును అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టాడని, అలాంటి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

అందర్‌బంద్‌లో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

భీంపూర్: అందర్‌బంద్‌లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. మండల వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచి తంగా మందులు పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రూహిదాస్, సాహితి, మాయావతి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.